'దోస్త్' అడ్మిషన్లు షురూ

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలను సైతం ప్రకటించిన నేపథ్యంలో డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించారు. ఈసందర్భంలోనే డిగ్రీ ప్రవేశాల కోసం దోస్త్ నోటిఫికేషన్ విడుదల చేశారు. 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ దోస్త్‌కు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. మే 6నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైంది.

రిజిస్ట్రేషన్ విధానం..

విద్యార్థులు ఇదివరకే ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నంబర్ గల విద్యార్థులు నేరుగా దోస్త్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అనుసంధానం కాకుంటే తల్లిదండ్రుల ఫోన్ నంబర్ ఆధార్‌తోను అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులు టీ-యాప్ ద్వారా సెల్ఫీతోనూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఐడీ, పిన్ నంబర్ వస్తుంది. వాటిని ఉపయోగించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారం వివరాలు నింపాలి. కోరుకున్న కళాశాలో సీటు వస్తే సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా కన్ఫర్మేషన్ చేసుకోవాలి. ఏ దశ కౌన్సిలింగ్‌లో అయినా సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా కన్ఫర్మేషన్ చేసుకున్న విద్యార్థి జూన్ 29 నుంచి జూలై 05 మధ్య కళాశాలకు వెళ్లి ధ్రువపత్రాలను సమర్పించి ఫీజు చెల్లించాలి. మొదటి ఫేస్ రిజిస్ట్రేషన్లు మే 6–25వరకు, వెబ్ ఆప్షన్ల నమోదు మే 15–27, సీట్ల కేటాయింపు జూన్ 3, రెండో దశ రిజిస్ట్రేషన్లు జూన్ 4నుంచి 13 వరకు, వెబ్‌ఆప్షన్ల నమోదు జూన్ 04–14, సీట్లు కేటాయింపు జూన్ 18, మూడో దశ రిజిస్ట్రేషన్లు జూన్ 19–25, వెబ్‌ఆప్షన్లు నమోదు జూన్ 19నుంచి 26వరకు, సీట్ల కేటాయింపు జూన్ 29న, ఫస్టియర్ సెమిస్టర్ తరగతులు జూలై 8న ప్రారంభం అవుతాయి.



మానుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సద్వినియోగం చేసుకోవాలి



కార్పొరేట్ కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో సకల సౌకర్యాలతో, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, విద్యార్థినులకు హాస్టల్ వసతి కలదు. ఇట్టి అవకాశాన్ని ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– డి.రాజు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, మానుకోట

దుర్గంధంతో ఉక్కిరి బిక్కిరి

- డంపింగ్‌యార్డుగా మారిన బంధం కుంట

డోర్నకల్: డోర్నకల్ పట్టణ శివారులోని బంధం కుంట డంపింగ్ యార్డుగా మారింది. ప్రస్తుతం బంధం కుంటలో నీళ్లు లేవు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డు లేకపోవడంతో బంధం కుంట పరిసరాల్లో ప్రతీ రోజూ మున్సిపాలిటీ పరిధిలోని చెత్తను కుంటలో పడేస్తున్నారు. సుమారు సంవత్సర కాలంగా చెత్తను వేస్తున్నారు. దీంతో కుంట పరిసరాల్లో చెత్త పేరుకుపోయింది. కుంట పరిసరాలు తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి. కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తకు నిప్పు పెట్టడంతో పొగ వ్యాపిస్తోంది. దీంతో చుట్టుపక్కల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ అధికారులు స్పందించి కుంట పరిసర ప్రాంతంలో చెత్త వేయకుండా చర్య తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బంధం కుంట పక్కన పేరుకుపోయిన చెత్త



చెత్తకు నిప్పు పెట్టడంతో వ్యాపిస్తున్న పొగ

క్లుప్తంగా

బొడ్రాయి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పూజలు



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వీరారంతండాలో బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ వార్డు కౌన్సిలర్ భూక్య శ్రీను, కాంగ్రెస్ నాయకులు ఎల్లండి వెంకటరెడ్డి, శంతన్ రామరాజు, బొమ్మరాజు కుమారస్వామి, నరేష్, భావ్ సింగ్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సీఐ



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని అండర్ బ్రిడ్జి సమీపంలో ఓ వ్యక్తి కిందపడిపోవడంతో తలకు తీవ్రగాయమై ఇబ్బంది పడుతున్న క్రమంలో అటువైపుగా వెళ్తున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ స్పందించి మానవత్వం చాటుకున్నారు. ఆయన వాహనం దిగి వెంటనే గాయపడిన వ్యక్తిని తన వాహనంలోకి ఎక్కించుకొని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

అనాథ పిల్లలకు చేయూత



గార్ల: మండలంలోని పాతపోచారం గ్రామంలో తల్లితండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, ఉమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

డిక్షనరీల పంపిణీ

కేసముద్రం: మండలంలోని తావుర్యాతండా జీపీలో ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన 28 మంది విద్యార్థులకు మిషన్ విద్యా విజ్ఞాన్ సేవ ఆధ్వర్యంలో డిక్షనరీలు, పెన్నులను మంగళవారం అందజేశారు. అనంతరం విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవిందర్, మోహన్, చైతన్యకుమార్, దేవేందర్, యాకుబ్, మహేష్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు పాతారు.. తీగలు అమర్చడం మరిచారు



కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలోని ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో రోడ్డు పక్కన విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలను పాతి తీగలను అమర్చకుండా మరిచిపోయారు. మూడేళ్ల క్రితం అధికారులు విద్యుత్ స్తంభాలను పాతినప్పటికీ స్తంభాలకు విద్యుత్ తీగలను ఏర్పాటు చేయకపోవడం ద్వారా స్తంభాలు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని కాలనీవాసులు నాగేష్, మహేష్ అధికారులను కోరుతున్నారు.

సైడ్ కాల్వల్లో పూడిక తొలగింపు



గార్ల: గార్ల మండలం మద్దివంచ గ్రామంలోని 4వ వార్డులో సైడ్ కాల్వల్లో పూడిక పేరుకుపోయిందని పంచాయతీ సిబ్బందికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోక పోవడంతో మంగళవారం గ్రామస్తులు శ్రమదానం ద్వారా కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టారు. ఎవరి ఇంటి ముందు వారే కాల్వలో పూడిక తీసుకున్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

గూడూరు: మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ ఏపూరు శ్యాంసుందర్‌రెడ్డి, అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్ అన్నారు. దేవాలయ ప్రాంగణంలో మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులు, కుల పెద్దలతో కలసి సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం బ్రహ్మోత్సవ కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేరుగు నరేష్‌గౌడ్, కాల్సాని వేణుమాధవ్‌రెడ్డి, వాంకుడోతు కొమ్మాలునాయక్, ఏపూరు వెంకట్‌రెడ్డి, పింగిళి శ్రీనివాస్, శివరాత్రి సంపత్, సురేందర్, మల్లయ్య గౌడ్, వెంకటయ్య, యాకయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తపై దాడి విచారకరం

మహబూబాబాద్ రూరల్: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా మహబూబాబాద్ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన భద్రు అనే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తపై కొందరు వ్యక్తులు దాడిచేయడంతో తీవ్రగాయాలపాలై ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మిట్టకంటి రాంరెడ్డి, అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య మంగళవారం భద్రును పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితిని గురించి వైద్యుడిని అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్త భద్రుపై విచక్షణారహితంగా దాడి చేసిన బీఆర్ఎస్ గుండాలను విడిచిపెట్టేది లేదన్నారు. భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తపై దాడి జరగకుండా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేలా పోలీసులను కోరుతామన్నారు. బాధితుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



భద్రును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

సంక్షేమ పథకాలు అమలు చేయాలి



నివాళులర్పిస్తున్న సత్యవతిరాథోడ్

డోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలకు మేలు చేయాలని కోరుకుంటున్నానని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ పేర్కొన్నారు. మండలంలోని లింబ్యాతండాలో ఇటీవల బాదావత్ సాల్కు అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం సత్యవతి రాథోడ్ సాల్కు కుమారుడు శంకర్‌నాయక్‌తోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతోపాటు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు లక్ష కోట్ల రూపాయలకు పైగా అవసరమవుతాయన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. ఇలాంటి పరిస్థితిలో రాష్ట్రానికి అప్పు కూడా పుట్టే పరిస్థితి లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు పెడుతూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ బిందు, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి బిక్షంరెడ్డి, మాజీ సర్పంచులు పాండునాయక్, బాలాజీ, నాయకులు మన్యుపాట్ని, సతీష్‌కుమార్, మోహన్,నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జి ఖండిస్తున్నాం..

మహబూబాబాద్ అర్బన్: నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయ ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు నారాయణఖేడ్ ఆర్డీఓ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏ.మురళీకృష్ణ, ఎస్‌కే.యాకూబ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గంలో పీఓ, ఏపీఓలకు రోజుకు రూ.600, ఓపీఓలకు రోజు రూ.400 ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 619ని ఈనెల 11న విడుదల చేసిందన్నారు. ఉత్తర్వుల ప్రకారమే మెదక్ నియోజకవర్గం పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గంలో పీఓ, ఏపీఓలకు రూ.3,150లు చెల్లించగా, నారాయణఖేడ్‌లో మాత్రం రూ.2,400 మాత్రమే ఇచ్చారన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో డోర్నకల్, మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలలో నిబంధనలకు అనుగుణంగా పీఓలకు 2,550, ఓపీఓలకు రూ.1350 ఇచ్చారని, అదేవిధంగా హోం ఓటింగ్‌లో పాల్గొన్నవారికి రెండు రోజుల రెమ్యూనరేషన్ చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఆర్డీఓపై చర్య తీసుకోవాలని, ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారికి సమాన రెమ్యూనరేషన్ చెల్లించాలని వారు కోరారు. ఈ సమావేశంలో నాయకులు ప్రవీణ్ కుమార్, రాజశేఖర్, హరినాయక్, కుమార్, ప్రసాద్, బాబు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

ఖానాపురం: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు తెలిపారు. మండలంలోని ఐనపల్లిలో హరితమిత్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం వారు ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో 'ఏ' గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2,203, కామన్ రకాలకు రూ.2,183 చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తారని తెలిపారు. ధాన్యం కొనుగోలు తర్వాత సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని చెప్పారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) స్వప్న, పీఏసీఎస్ సీఈఓ ఆంజనేయులు, మేరుగు రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బయ్యారం: మండలంలోని మిర్యాలపెంటలో అనారోగ్యంతో మృతి చెందిన పొడుగు హరిప్రసాద్ కుటుంబానికి మంత్రి పొంగులేటి శ్రీనన్న -ఎమ్మెల్యే కోరం కనకయ్య సేవా సమితి ఆధ్వర్యంలో రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సోమేష్, మాజీ సర్పంచ్ వెంకన్న, సభ్యులు మంగీలాల్, లక్ష్మీనారాయణ, మోహన్‌రావు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

గార్ల: ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ మండల నాయకులు మంగళవారం గార్ల సీహెచ్‌సీ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకుడు గుండా వెంకట్‌రెడ్డి, లాయర్ భూక్యా హరినాయక్, హతీరాం, రిటైర్డ్ ఆర్మీ జవాన్ మంగీలాల్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ



గూడూరు: మండలంలోని మదనాపురంలో నూతనం నిర్మించిన లక్ష్మీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వర ఆలయంలో మండల పూజా మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం నిర్మించి 41రోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం పూజారులు క్రాంతికుమార్, శ్రవణ్ వేద మంత్రోశ్ఛరణల నడుమ ఆలయ నిర్మాణ ధర్మకర్తలు లింగాల రాధికా సుధీర్‌రెడ్డి దంపతులు, భక్తులచే హోమం నిర్వహించారు. లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి అష్టోత్తర, నవగ్రహ పూజలు చేశారు. గోవిందనామస్మరణతో మదనాపుర గ్రామ వీధులు మారుమ్రోగాయి. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ములుగు: కురుస్తున్న వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కొనుగోలు చేయాలని కొత్తూరు ఎంపీటీసీ సభ్యురాలు పుష్పలతసత్యనారాయణరావు కోరారు. గ్రామ సమీపంలోని కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు నానాతంటాలు పడుతున్నారని అన్నారు. అధికారులు సాకులు చెప్పకుండా మద్దతు ధరతో కొనుగోలు చేసి వెంటనే ధాన్యం తరలించాలని కోరారు.

చందనం పూజ

ములుగు: ములుగు మండలం మల్లంపల్లిలో హనుమాన్ మాలాధారణ స్వాములు, భక్తులు ఎడ్ల అనిల్ రెడ్డి, మూల గణేష్‌రెడ్డి మంగళవారం చందనపూజ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాదం ప్రవీణ్‌కుమార్ హాజరై స్వామివారికి పూజలు చేశారు. చందనోత్సవం సందర్భంగా గ్రామంలోని పలు కాలనీలు స్వామివారి నామస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా మాలధారణ స్వాములకు బాదం ప్రవీణ్‌కుమార్ హనుమాన్ చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో గొర్రె కుమార్, శ్యాంరావు, ద్రోణాచారి, మొర్రి రాజుయాదవ్ పాల్గొన్నారు.

'బలరాంనాయక్ గెలుపు ఖాయం'

నెహ్రూసెంటర్: ఇండియా కూటమి మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపు ఖాయమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కూటమి గెలుపును కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారంలో సీపీఐ శ్రేణులు ఎంతగానో కృషి చేశారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుపు కోసం సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జిల్లా కార్యవర్గం, జిల్లా సమితి, గ్రామ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులకు అభినందలు తెలిపారు.

గూడూరు: ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అధిక మెజార్టీతో గెలుస్తాడని మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టినట్లుగా ప్రజలు ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై ఎంపీగా బలరాంనాయక్ గెలుపు కోరారన్నారు. కాంగ్రెస్‌పై నమ్మకంతో ఓటు వేసిన ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి ఏర్పాటు చేసిన సమావేశంలో బలరాంనాయక్ గెలుపునకు కృషి చేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, బీరం శ్రీపాల్‌రెడ్డి, చంటి స్వామి, వాంకుడోతు కొమ్మాలు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేం శ్రీనివాస్‌రెడ్డి, హెచ్.శివ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పక్షానే ప్రజలు నిలిచారు

కేసముద్రం: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పక్షానే ప్రజలు నిలిచారని పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల సరళిపై పార్టీ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్, బీజేపీలు కలసి, కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేశారని, అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను, కేంద్రం ఇచ్చిన ఐదు న్యాయాలను ప్రజలు విశ్వసించారన్నారు. కార్యక్రమంలో ధన్నసరి సొసైటీ మాజీ అధ్యక్షుడు బండారు వెంకన్న, డీసీసీ కార్యదర్శి తండా వెంకన్న, సంపత్, కీర్తి సురేందర్, సారయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, గణేష్, మహేందర్ పాల్గొన్నారు.

మద్దతుగా నిలిచిన ఓటర్లకు కృతజ్ఞతలు

గార్ల: పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి బలరాంనాయక్‌కు మద్దతుగా నిలిచి ఓట్లు వేసిన మండల ఓటర్లకు సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన తండావాసులు

మరిపెడ రూరల్: మండలంలోని గుర్రప్పతండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పలువురు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ గ్రామంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. గుర్రప్పతండా అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. అదే విధంగా మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మరళీనాయక్, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బానోతు రామన్న, నాయకులు రామన్న, శరత్, శంకర్, తిరుపతి, సుధీర్, శ్రీను, వెంకన్న, బిచ్య, ప్రకాష్, సునీత, రంజిత్, బాలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

శంభాజీ మహరాజ్ జయంతి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న సమితి సభ్యులు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్ వద్ద ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో ధర్మవీర్ శంభాజీ మహరాజ్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంలో ధర్మ జాగరణ మండల ప్రముఖ్ రాణాశంకర్ మాట్లాడుతూ.. తండ్రి ఛత్రపతి శివాజీ అడుగుజాడల్లో నడిచిన మహాయోధుడు ధర్మవీర్ బీరుదాంకితుడు శంభాజీ మహరాజ్ అన్నారు. ఔరంగజేబు చేతిలో ఎన్నో చిత్రహింసలకు గురైనప్పటికీ తన స్వధర్మాన్ని వీడకుండా ఎంతోమంది హిందూ యోధులకు స్ఫూర్తినిచ్చాడని, అలాంటి మహావ్యక్తి అడుగుజాడల్లో యువత నడవాలని కోరారు. అలాంటి గొప్ప వీరుడి జయంతి వేడుకలు నిర్వహించడం చాలా గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో సుశ్రుత ఫౌండేషన్ అధినేత డాక్టర్ చౌకీదార్ రవీందర్ నాయక్, వివిధ క్షేత్రాల సభ్యులు మార్కపురి శ్రావణ్, రామరాజు ప్రేంసాగర్, మైస రోహిత్, రవికుమార్ యాదవ్, నల్ల కిరణ్ కుమార్ గుప్తా, బొడ్డుపల్లి ప్రవీణ్, గౌతమ్ కుమార్, అనిల్, పెద్ది సురేష్, కుంట రజిత, యశ్వంత్ పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులు ప్రారంభం

- 'ఆర్‌డీఎఫ్' ప్రిన్సిపాల్ జనార్దన్

పర్వతగిరి : మండలంలోని కల్లెడ గ్రామంలోని ఆర్‌డీఎఫ్ వనిత అచ్యుత పాయ్ విద్యాలయ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరం నుంచి వృత్తి విద్యా కోర్సులు ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ ఎ.జనార్ధన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాకు మంగళవారం వివరాలు వెల్లడించారు. ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ/ఏఎన్ఎం (మహిళ), ఈటీ, సీఎస్‌సీ కోర్సులు ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంఎల్‌టీ అభ్యసించిన విద్యార్థులు సొంతగా ల్యాబ్ ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి, ప్రభుత్వ, డెంటల్ కాలేజీల్లో, క్లినికల్ ల్యాబ్‌ల్లో ఉద్యోగం పొందవచ్చని తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ/ఏఎన్ఎం (మహిళ) అభ్యసించిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నర్సు ఉద్యోగం పొందవచ్చని, బీఎస్సీ నర్సింగ్ అభ్యసించవచ్చని వివరించారు. మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 99493 83450, 99593 01913 సంప్రదించాలని తెలిపారు.

హనుమాన్ హోమగుండ పూజలు

నర్సంపేట: పట్టణంలోని శాంతినగర్‌లో హనుమాన్ మాల ధరించిన భక్తులు మంగళవారం కుటుంబ సమేతంగా హోమగుండ పూజలు వేడుకగా నిర్వహించారు. పూజారి గూడ రామకృష్ణమూర్తి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు హనుమాన్ మాల 41 రోజు దీక్షలో భాగంగా 28వ రోజును పురస్కరించుకొని పట్టణంలో తొలిసారిగా హనుమాన్ సువచ్చలాదేవి విగ్రహానికి పూజ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి గుర్రం వెంకన్న, అప్పాల శ్రీకాంత్, వానం భిక్షపతి, రాయపురం రాజు, పులిచేరి రమేశ్, రాయపురం ప్రవీణ్, పాలకుర్తి మధు, శ్రీరాముల రాజు, పల్లకొండ సాంబయ్య, గుర్రం పాషా, పాలకుర్తి రవి, మెరగుర్తి రమేశ్, రమావత్ నారాయణ, వేమునూరి సుధాకర్, పల్లకొండ సాంబరాజ్, అన్నం రాజు, నూనె స్వామి, తదితరులు పాల్గొన్నారు.